క్లుప్తంగా

సాయిబాబాకు అన్నదానం ప్రీతిపాత్రం

తెనాలి: సాయిబాబాకు అత్యంత ప్రీతిపాత్ర మైంది అన్నదానమేనని సాయిప్రసాదం సేవా సమితి వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం చినరావూరు డొంకలోని కాలనీలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మారుతి ఆలయం ప్రాంగణంలో 150 మంది పేదలకు చిన్నారులు అభిరామ్, మీనాక్షి సౌజన్యంతో ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఎవరైనా కోరినట్లయితే వారు నివసించే కాలనీలోనూ అన్నదానం చేస్తామని చెప్పారు.

పెదరావూరు ఉప సర్పంచ్ జాస్తి సమత



పెదరావూరు(తెనాలి): రూరల్ మండలం పెదరావూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా 2వ వార్డు సభ్యురాలు జాస్తి సమత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి జయంత్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ ఎన్నిక కోసం ప్రతి పాదనలు కోరిన వెంటనే 14వ వార్డు సభ్యుడు షేక్ నాగూర్.. సమత పేరును ప్రతిపాదించారు. 12వ వార్డు సభ్యుడు శ్రవణం శ్రీనివాసరెడ్డి బలపరిచారు. ఇతర ప్రతిపాదనలు ఏవీ లేకపోవటంతో ఉప సర్పంచ్‌గా జాస్తి సమత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, తెనాలి ఎంఈఓ-2 జయంత్‌బాబు ప్రకటించారు. ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఆమెకు అందజేశారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, కార్యనిర్వహణాధికారి రామ సుబ్బారావు, కారుమంచి శ్రీనివాసరావు, దావులూరి శ్రీనివాస్, నిమ్మగడ్డ బుజ్జి, జాస్తి నరేంద్ర, పి.రత్తయ్య, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం

తెనాలి: సమాజంలో యువతులు, మహిళల పట్ల జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు అన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నారాయణ జూనియర్ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థినులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు. విద్యార్థి దశలో సినిమాలు, షికార్లు, ప్రేమల పేరుతో జీవితాన్ని సమస్యలమయం చేసుకోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సీపీఎం తెనాలి నియోజకవర్గ కార్యదర్శి కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ మంచిగా చదువుకుని, తల్లిదండ్రులతో ప్రేమానురాగాలను కలిగి ఉండాలన్నారు. ఈ సదస్సుకు ప్రిన్సిపల్ పవన్ అధ్యక్షత వహించారు. కాలేజి ఏవో, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆరే మరియదాసు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిరూరల్:జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి(ఇన్‌చార్జి) కేపీ బాలాజీ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 9న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రాధిక ఏకగ్రీవ ఎన్నిక



రాధికకు నియామకపత్రాన్ని అందజేస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



రాధిక, రమేష్ దంపతులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

- నియామకపత్రాన్ని అందజేసిన సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ
- రాధికను అభినందించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ చైర్ పర్సన్‌గా 8వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రాధిక ఏకగ్రీవంగా ఎన్నికైంది. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం చైర్ పర్సన్ ఎన్నికను నిర్వహించారు. ఎన్నికల అధికారిగా తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ వ్యవహరించారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ పదవికి పోటీ చేసేవారి వివరాలు కౌన్సిలర్లు తెలియజేయాలని ప్రకటించారు. 12వ వార్డు కౌన్సిలర్ కుర్రా యశోద రమావత్ లేచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రాధిక పేరును ప్రతిపాదించారు. 33వ వార్డు కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్ ఆమె ప్రతిపాదనను బలపరిచారు. ఇంకా ఎవరైనా పోటీలో ఉంటే తెలియజేయాలని సబ్ కలెక్టర్ కోరారు. ఎవరి నుంచి స్పందన రాకపోవడంతో చైర్‌పర్సన్‌గా రాధికను నియమిస్తున్నట్లు ఆమె ప్రకటించి, నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం రాధికతో ప్రమాణస్వీకారం చేయించారు. రాధికకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు అభినందనలు తెలియజేసి చైర్ పర్సన్ సీటులో కూర్చోబెట్టారు. సర్వమత ప్రార్థనలు జరిపారు. అనంతరం తాడిబోయిన రాధిక, రమేష్ దంపతులను ఎమ్మెల్యేతో పాటు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్నేహితులు, బంధువులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెనాలి ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయండి

తెనాలి పట్టణానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఎందరో ఉద్దండుల పాలనలో మున్సిపాలిటీ కొనసాగిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు తెనాలి ఖ్యాతిని పెంచారని చెప్పారు. చైర్ పర్సన్‌గా ఎన్నికై న తాడిబోయిన రాధిక తెనాలి ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేలా కృషి చేయాలని సూచించారు. గతంలోఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వం సామాజిక సాధికారిత అమలు చేస్తుందని చెప్పారు. చైర్‌పర్సన్‌గా బీసీ మహిళను, ఎంపీపీగా రజక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించడం జరిగిందన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికారిణి కట్టబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తెనాలి నియోజకవర్గంలో ఆ బీజాన్ని నాటటం జరిగిందన్నారు. ఆ సంప్రదాయం రానున్న రోజుల్లో కూడా కొనసాగిస్తామని చెప్పారు.

తెనాలి అభివృద్ధికి కృషి చేస్తా.

తెనాలి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తాడిబోయిన రాధిక అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక, రమేష్

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీసీ మహిళలకు వైఎస్సార్‌సీపీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. చైర్‌పర్సన్ పదవి జనరల్ మహిళగా ఎన్నికల కమిషన్ ప్రకటించిన, బీసీ మహిళనైనా తనను చైర్‌పర్సన్‌గా నియమించడం సామాజిక సాధికారతకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

భారీ ర్యాలీ

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తాడిబోయిన రాధిక అభినందన సభను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మున్నంగి(కొల్లిపర): సంక్షేమం అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని మండల పార్టీ కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మున్నంగి గ్రామంలో గ్రామ సచివాలయం 2 పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని సర్పంచ్ వేమూరి ధీనమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్, ఎంపీపీ హాజరై ప్రసంగించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో ఇంటింటికి నాయకులు తిరిగి సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తూ ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకు తెలియజేశారు. అనంతరం నాయకులు పల్లె నిద్ర చేశారు. మాజీ పార్టీ కన్వీనర్ ఆరిగ చంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కళ్లం వెంకటప్పారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, వేమూరి సురేష్, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి: మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 10వ వార్డులోని నాజర్‌పేట-1 సచివాలయం వద్ద గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ జశ్వంతరావు, కౌన్సిలర్ సామ్రాజ్యం

ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్న పథకాల ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. కౌన్సిలర్ తిరుమలశెట్టి సామ్రాజ్యం, వైఎస్సార్ సీపీ పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిందని చెప్పారు. పదోవ వార్డులో ఇప్పటి వరకు రూ.22.33కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి బోర్డును ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ కన్వీనర్ తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కఠెవరం ఉప సర్పంచ్‌గా బాబు సాహెబ్

తెనాలిటౌన్: కఠెవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా షేక్ బాబుసాహెబ్ గురువారం ఎన్నికయ్యారు. పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులతో రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించారు. 14 మందికిగాను 10 మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. ఉప సర్పంచ్ పదవికి షేక్ బాబుసాహెబ్ నామినేషన్ దాఖలు చేయగా వార్డు సభ్యులు బొనిగల సునీత, కొత్తపల్లి సుదర్శన్ బలపర్చారు. మెజారిటీ సభ్యులు ఆమోదించడంతో షేక్ బాబుసాహెబ్ ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఎన్నికల ధృవీకరణ పత్రం అందజేసి, ప్రమాణస్వీకారం చేయించారు. సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ గౌస్ ఉన్నారు. బాబు సాహెబ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు గంపల శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ మైలా భానుప్రసాద్, మాజీ ఎంపీటీసీలు సంకురు బుజ్జిబాబు, పిడపర్తి కిరణ్‌కుమార్, పార్టీ కన్వీనర్ శివారెడ్డి తదితరులు అభినందించారు.



బాబుసాహెబ్‌కు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వరరావు

హాఫ్‌పేట ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా..

హాఫ్‌పేట పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. రిటర్నింగ్ అధికారి మేకల లక్ష్మీనారాయణ నిర్వహించిన సమావేశంలో 10మంది సభ్యులకుగాను నలుగురు మాత్రమే హాజరయ్యారు. కోరం కాకపోవడంతో ఉప సర్పంచ్ ఎన్నికను వాయిదా వేశారు.

తెనాలి ఎంపీపీగా చెన్నకేశవులు ఎన్నిక

తెనాలిటౌన్: తెనాలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా కంచర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు ధర్మరాజుల చెన్నకేశవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి వి.వనజ ఎంపీపీ ఎన్నికను నిర్వహించారు. మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా 16మంది హాజరయ్యారు. ఎంపీపీ పదవికి ధర్మరాజుల చెన్నకేశవులు నామినేషన్ వేయగా పెదరావూరు-1 ఎంపీటీసీ సభ్యుడు రావూరి ఏసుదాసు నామినేషన్‌కు ప్రతిపాదించగా, అంగలకుదురు-1 ఎంపీటీసీ సభ్యురాలు ముప్పవరపు సంధ్యారాణి బలపరిచారు. ఎంపీపీగా చెన్నకేశవులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి వనజ ప్రకటించారు. అనంతరం ఆయనతో ప్రమాణస్వీకారం చేయించి, ఎన్నిక ధ్రువీకకరణ పత్రాన్ని అందజేశారు. ప్రిసైడింగ్ అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాపరెడ్డి ఉన్నారు. అనంతరం ఎంపీపీగా ఎన్నికైన చెన్నకేశవులును ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్‌లు అభినందనలు తెలిపారు.



ఎంపీపీ చెన్నకేశవులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శివకుమార్

ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థకు భూమిపూజ

తెనాలి: పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడంలో భాగంగా సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిర్ణయించారు. ప్రముఖ పారిశ్రామిక సంస్థ సీసీఎల్ సహకారంతో దాదాపు రూ.30 లక్షల వ్యయంతో పట్టణంలో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ వీటిని అమర్చాలన్నది ఎమ్మెల్యే శివకుమార్ స్వయంగా పోలీస్ అధికారులతో కలిసి పరిశీలన చేసిన విషయం తెలిసిందే. పట్టణంలో ఎనిమిది కూడళ్లలో వీటిని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు గురువారం ఉదయం స్థానిక బోసు రోడ్డులో వీనస్ టాకీస్ ఎదురుగా భూమిపూజ చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు భూమిపూజ చేశారు. పట్టణంలో వాహన రద్దీని క్రమబద్ధీకరిస్తూ ఎమ్మెల్యే శివకుమార్ సిగ్నలింగ్ వ్యవస్థను తీసుకొస్తున్నట్టు హరిప్రసాద్ చెప్పారు. ప్రజలు, వాహన చోదకులు సిగ్నల్స్‌ను అనుసరించి నడుచుకుంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని డీఎస్పీ జనార్దనరావు అన్నారు. నంది వెలుగు



భూమిపూజ చేస్తున్న హరిప్రసాద్, జనార్దనరావు

కూడలి ప్రాంతంలోనూ ట్రాఫిక్ సిగ్నలింగ్‌ను అమల్లోకి తేవాలని ఈ సందర్భంగా తెనాలి పట్టణ, పరిసర ప్రాంతాల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. భూమి పూజలో పట్టణ సీఐలు కె.చంద్రశేఖర్, రమేష్‌బాబు, ఎస్.వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ బి.శివరామయ్య, ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.రాజశేఖర్, మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు, పాటిబండ్ల శ్రీనివాసరావు, చుండూరు సాయి, బ్రహ్మం పాల్గొన్నారు.

ఆంధ్ర ఔట్‌డోర్ లోకేషన్స్‌ను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: సినిమా నిర్మాణాలకు మన రాష్ట్రం అనువైనదని, వ్యయం కూడా తక్కువగా అవుతుందని, ఔట్‌డోర్ లోకేస్స్ ఎక్కువగా ఉన్నాయని సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని మా ఏపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబసింగి, అరకు లోయ, విశాఖపట్నం, ఎర్రకొండలు, కొండవీడు, నిజాంపట్నం హార్బర్, లోయలు, జలపాతలు, కొండలు, అటవీ ప్రాంతం, అందమైన లంక గ్రామాలు ఇలా ఎన్నో సినిమా స్థాయిని పెంచే లోకేషన్లు ఉన్నాయని చెప్పారు. తక్కువ బడ్జెట్‌తో సినిమాలు నిర్మించే నిర్మాతలకు ఆంధ్రప్రదేశ్ వరప్రసాదం లాంటిదన్నారు. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మళయాళి, బోజీపూరి నిర్మాతలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్తరప్రదేశ్ నటుడు అమీర్ చౌదరి, మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

తెనాలిఅర్బన్: ఆర్థిక అక్షరాస్యతపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఆ పథక జిల్లా రిసోర్స్ పర్సన్ డాక్టర్ శీతాలపు శ్రీనివాసరావు సూచించారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు, పెట్టుబడుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇలాంటి విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమను సంప్రదించాలని చెప్పారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు, ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన

కొల్లిపర: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఏఓ వి.చంద్రమోహన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం మండల కమిటీ, టెక్నికల్ బృందం సభ్యులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, వివిధ శాఖల అధికారులకు ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. క్రీడా పోటీలకు అనుగుణంగా ఉన్న పాఠశాలల మైదానాలను పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ఇందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జి.నాంచారయ్య, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదన్‌రెడ్డి, మండల వైద్యాధికారి లక్ష్మీసుధ పాల్గొన్నారు.



అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఏవో చంద్రమోహన్

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

తెనాలిటౌన్: రూరల్ మండలంలోని శాఖ గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. కొలకలూరులోని గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణరావు, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యత పై వ్యాస రచన పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 20మంది విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న కె.ఆదినారాయణ గ్రంథాలయంలో సభ్యత్వం ఇప్పించారు.

- నందివెలుగులోని శాఖగ్రంథాలయంలో విక్టోరియా స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి బొల్లు మాధవి వ్యాసరచన పోటీలు జరిపారు.
- పెదరావూరులోని శాఖ గ్రంథాలయంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యతపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు జరిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ.రాఘవేంద్రరావు, తెలుగు ఉపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, డ్రాయింగ్ ఉపాధ్యాయులు పి.వెంకటకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల సంస్మరణ

తెనాలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల సంస్మరణ నిర్వహించారు. ప్రముఖ కవి, రచయిత విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్కరాజు లక్ష్మణరావు, విశ్రాంత గ్రేడ్-1 గ్రంథాలయాధికారి మొవ్వా సుబ్బారావు పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులు, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ గురించి ప్రసంగించారు. వారి



కొలకలూరు గ్రంథాలయంలో ఉద్యమ నాయకుల చిత్రపటాలకు నివాళి

చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, పి.వెంకట కోటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి కావూరి రమాదేవి పర్యవేక్షించారు.

సంగం జాగర్లమూడిలో గ్రంథాలయ వారోత్సవాలు

సంగంజాగర్లమూడి(తెనాలి): తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడిలోని శాఖ గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం సేవలను ప్రధానోపాధ్యాయుడు షేక్ కాలేషా, ఉపాధ్యాయుడు విశ్వనాథ్ గురువారం నాటి సభలో వివరించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ పాఠశాలల బాలబాలికలకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. జూనియర్స్‌కు పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు, సీనియర్స్‌కు గ్రంథాలయ ఉద్యమంలో ఎస్ఆర్ రంగనాథన్ పాత్రపై ఈ పోటీలను జరిపారు. గ్రంథాలయాధికారి జె.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.